"బుల్లి బుల్లి ఎర్రని బుగ్గలదానా
—చెంపకు చారెడు కన్నులదానా
మరచిపోయావా నువ్వే మారిపోయావా?"—

హఠాత్తుగా వెనకాల నుండి పాట వినిపించే సరికి ఉలిక్కిపడ్డారు విజయ, ప్రసన్న. తల తిప్పి చూసింది ప్రసన్న. అంతవరకూ వారి వేపే చూస్తూ పాడుతున్న విద్యార్థి చటుక్కున చూపులు తిప్పుకుని ఆకాశంలోకి చూసి గొంతు సవరించుకుని క్రాపు సవరించుకున్నాడు. ప్రక్కనున్న మరొక విద్యార్థి—మొహం అంతా నోరు చేసుకుని ఇకిలించాడు. కోపంగా ఏదో అనబోయి, అంతలోనే తన్ను తాను నిగ్రహించుకుని మళ్లా నడవ సాగింది ప్రసన్న.

"నిలువవే వాలుకనులదానా—వయ్యారి హంస నడకదానా
నీ నడకలో హొయలున్నదే చానా!"

మళ్ళా పాట!

చివ్వున వెనక్కి తిరగబోయింది ప్రసన్న. ఇంతలో విజయ ఆమె భుజం బలంగా గుచ్చి పట్టుకుని ఆపేస్తూ, "ప్లీజ్—ప్రసన్నా—తొందర పడకు—వెళ్ళిపోదాం పద"—అంది కంగారుగా. ఆవేశాన్ని బలవంతంగా దిగమ్రింగి ప్రసన్న విజయని అనుసరించింది. ఇద్దరూ తొందరగా నడవసాగారు. ఆ విద్యార్థులు కూడా వీళ్ళ వెనకే రాసాగారు. ఒకవేపు పాడుపడిన సమాధులూ, మరోవేపు ఎత్తైన ప్రహరీ గోడలతో చాలా నిర్మానుష్యంగా ఉండే వీధి అది. మెయిన్‌రోడ్డు మీద ఉన్న సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీకి ఇది దగ్గరగా ఉండే అడ్డదారి. కాని సాధారణంగా ఆడపిల్లలెవ్వరూ ఇటురారు. దూరమయినా మెయిన్‌రోడ్ మీద నుంచే వెడతారు. విజయ, ప్రసన్న కూడా ఎప్పుడూ అంతే. కాని ఈ రోజు బయలు దేరడం ఆలస్యం కావడంతో సాహసించి ఇటు వచ్చేశారు. వచ్చినందుకు భయపడినంతా జరిగింది. ఇద్దరూ గబగబా నడుస్తూనే ఉన్నారు. ఆ విద్యార్థులూ అలా వెనకాల వస్తూనే ఉన్నారు.

ఇంకొక ఫర్లాంగున్నర నడిస్తేనే కాని మెయిన్ రోడ్డు రాదు. ఇంతలో ఒక ఎర్రని ఫియట్ కారు హఠాత్తుగా మలుపు తిరిగి ఈ వీధిలోకి రాసాగింది. ప్రసన్న చటుక్కున రోడ్డుకు అడ్డమెళ్ళి ఆపమన్నట్టుగా చేయి ఊపుతూ నిలబడింది. జరిగిందేమిటో విజయకు అర్థమయ్యేలోగానే ఆ కారు రావడమూ, ప్రక్కగా ఆగడమూ జరిగిపోయాయి. కారు ఖాళీగా ఉంది. డ్రైవ్ చేస్తున్న వ్యక్తి తల బయటికి పెట్టి "ఎస్ మేడం—వాట్ కేన్ ఐ డు ఫర్ యూ?" అన్నాడు చిరునవ్వుతో. చటుక్కున ప్రసన్న అతని దగ్గరగా వెళ్ళి ఆ విద్యార్థులను చూపిస్తూ "వీళ్ళు మమ్మల్ని ఫాలో అవుతున్నారు. దయచేసి మాకు లిఫ్ట్ ఇవ్వండి-" అంది. అంటూ, అతని సమాధానం కోసం ఎదురుచూడకుండానే వెనకాల తలుపు తెరుచుకుని లోపలికి ఎక్కేసింది. ఆ వ్యక్తి కొద్దిగా తెల్లబోయి, అంతలోనే తేరుకుంటూ, స్థాణువులా నిలబడిపోయిన విజయతో "రండి మీరు కూడా" అని కారు స్టార్టుచేశాడు. విజయ కూడా యాంత్రికంగా అందులోకి ఎక్కింది. మరుక్షణంలో ఆ విద్యార్థుల కళ్ళలోకి దుమ్ము రేపుతూ వెనక్కు తిరిగి కారు కాలేజీవేపుగా దూసుకుపోయింది.

కాలేజీ గేటు దగ్గర కారు దిగి "థేంక్స్—మీ మేలు మర్చిపోం"—అంది ప్రసన్న. "ఇంత మాత్రానికే!"—అంటూ నవ్వి కారు స్టార్టు చేశాడు అతను. ఇద్దరూ నమస్కారం చెప్పి లోపలకు వచ్చేశారు. ఆ రోజంతా విజయ ముభావంగా ఉండిపోయింది. గలగలా మాట్లాడే ప్రసన్నకి ఆమెను పలకరించాలంటే ఏదో బెరుకు లాంటిది కలిగింది. మౌనంగా ఒకళ్ళకొకళ్ళు పట్టనట్టుగా సాయంత్రం వరకూ గడిపేశారు.

అలా ప్రసన్న ఏదో ఒకటి చేసేస్తుండడం, ఆ తర్వాత వెంటనే విజయని పలకరించడానికి భయపడి బెరుకు బెరుకుగా రెండు రోజులపాటు తిరగడం ఈ రోజు క్రొత్తగా వచ్చింది కాదు. చిన్నప్పటి నుండి అలవాటే. హడావుడిగా మాట్లాడుతూ, కంగారు పడిపోయే ప్రసన్నకు, నిదానంగా ఆలోచించి మాట్లాడే విజయకూ అయిదోక్లాసు నుండే స్నేహం. ఒకే వీధిలో ఉంటున్న వాళ్ళ స్నేహలత సంవత్సరాలు గడిచే కొద్దీ పెనవేసుకు పోయింది. ఇద్దరూ బి. ఎస్సీ—ఆఖరి సంవత్సరంలో ఉన్నారు.

ఎన్నికల సంరంభంతో కాలేజీ హడావుడిగా ఉంది. అభ్యర్థుల పేర్లతో జెండాలు తయారు చేసి కాలేజీ భవనం నుండి గేటు వరకూ తోరణాలుగా కట్టారు. పెద్ద భవనం ముందు-ఆ తోరణాల క్రింద గుంపులు గుంపులుగా ఉన్న విద్యార్థులతో—చూసేవాళ్ళకి మొదటి రోజు మార్నింగ్ షో సినిమా హాలులా—కాలేజీ హడావుడిగా కళకళలాడుతూ గందరగోళంగా ఉంది. ఆ గందరగోళమే లేడీస్ వెయిటింగ్ రూమ్‌లోనూ ఉంది. ప్రసన్న, విజయ వెయిటింగ్ రూమ్‌లో గుమ్మం ఎదురుగా ఉన్న బల్లదగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంతలో ఒక పదిమంది విద్యార్థులు గుమ్మం దగ్గర ప్రత్యక్షమయ్యారు. హఠాత్తుగా వాన వెలిసినట్లు వెయిటింగ్ రూమ్ అంతా సూదిపడినా వినిపించేటంత నిశ్శబ్దంగా మారిపోయింది. అందరూ చూస్తూ నిలబడిపోయారే తప్ప ఎవ్వరూ వచ్చిన వాళ్ళను పలకరించలేదు. చివరకు ప్రసన్నే చొరవగా ముందుకు వచ్చి "ఏంకావాలండీ"—అని అడిగింది. వచ్చిన వాళ్ళలో లేత నీలంరంగు బెల్ బాటమ్స్ వేసుకుని, ఏవో కాగితాలను జాగ్రత్తగా గుండెలకు హత్తుకుని ఉన్న విద్యార్థి గబగబా ఆ కట్ట విప్పి అందులో నుండి కొన్ని కాగితాలు బయట పెట్టాడు. ఒకటి తీసి ప్రసన్నకి ఇస్తూ "నా పేరు కృష్ణమూర్తి. మా ఫ్రెండ్ మోహన్ మన కాలేజీ యూనియన్ ప్రెసిడెంట్‌గా నిలబడుతున్నాడు. ఆడపిల్లల ఓట్లు అడగడానికి వచ్చాం" అంటూ అంతవరకూ ఓ ప్రక్కగా నిలబడి ఉన్న వ్యక్తిని చేత్తో ముందుకు లాగాడు. ఆ వ్యక్తిని చూస్తూనే ప్రసన్న తెల్లబోయింది. చేతులు జోడించి నవ్వుతూ "నన్ను గుర్తుపట్టారా?" అన్నాడతను. ఈ సారి తెల్లబోవడం కృష్ణమూర్తి వంతయింది. ప్రసన్న కూడా నవ్వి "అదేమిటీ – మీరు ఆపద్బాంధవులయ్యే!" అంది.

"మీ ఫ్రెండ్ కూడా ఉండాలి కదూ, ఆమె ఏరీ?" అన్నాడు మోహన్. ప్రసన్న జవాబు ఇచ్చేలోగానే "నమస్కారమండీ" అంటూ ముందుకు వచ్చింది విజయ.

"వీరు నీకు ముందే తెలుసా?" అడిగాడు కృష్ణమూర్తి ఆశ్చర్యంగా.

"అదేమిటండోయ్ - ఆయన ఆపదలో ఉన్న అబలల్ని ఆదుకునే ఆర్తత్రాణపరాయణులయితే...." అంది ప్రసన్న. మోహన్ ఆ నాటి సంగతి చెప్పాడు కృష్ణమూర్తికి.

# పండా శమంతకమణి

" అయితే ఇకనేం, మీ ఓటు...."

" మా ఓటే కాదు — మా ఆడపిల్లలందరి ఓట్లూ అబలా సంరక్షకులవే—" అంది ప్రసన్న హుషారుగా.

ఎన్నికలు వారం రోజులలోకి వచ్చేశాయి. అందరితోపాటు మోహన్ బృందం హడావుడి కూడా ఎక్కువగానే ఉంది. ఈ మధ్య ప్రసన్న కూడా వాళ్ళతో కలిసి, దూరంగా ఉండే విద్యార్థినుల ఇళ్ళకు ప్రచారం కోసం వెళుతోంది. విజయకు ఇదంతా నచ్చకపోయినా ప్రసన్న ఉత్సాహం చూసి వారించలేకపోయింది.


ఆ రోజు సాయంత్రం అయిదున్నర కావచ్చింది. మోహన్, కృష్ణమూర్తి, ప్రసన్న మరి కొందరు బేగంపేటలో ఉన్న విద్యార్థినుల ఇళ్ళకు వెళ్ళి వస్తున్నారు. దారిలో ఒకొక్కరే దిగిపోగా టాంక్‌బండ్ దగ్గరకు వచ్చేసరికి కారులో ప్రసన్న ఒక్కర్తే మిగిలింది. అప్పుడే వీధి దీపాలు వెలిగాయి. హుసేన్‌సాగర్ మీదనుంచి చల్లని గాలి అలలు అలలుగా తేలి వచ్చి ప్రసన్న బుగ్గల్ని తాకుతూ గిలిగింతలు పెడుతోంది. పమిట కొంగును తలమీదుగా కప్పుకుని వెనక్కు జారగిలబడి కారు అద్దాలగుండా చూస్తూ కూర్చుంది ప్రసన్న.

"సరిగ్గా బెంగాలీ సినిమా హీరోయిన్లా ఉన్నారు" అన్నాడు మోహన్ అద్దంలోనుండి ప్రసన్న వేపు చూస్తూ. ఉలిక్కిపడి తల యిటు త్రిప్పి నవ్వి— " మీరు పొగడనంతమాత్రాన ఎన్నికల్లో మీకు సహాయపడననుకున్నారేమిటీ ? " అంది.

" ఎన్నికలకి మీరు సహాయం చేసినా చేయక పోయినా ఎన్నికలు మటుకు నాకు చాలా సహాయం చేశాయి ".

" ఏమిటా సహాయం ? "

" జీవితం చివరి వరకూ సహాయపడే వ్యక్తిని నాకిచ్చాయి."



"అంటే?" ప్రసన్నకు నిజంగానే అర్థం కాలేదు.

"ఏముంది? ఎన్నికలు అవుతూనే నాన్నగారికి రమ్మని రాయాలి.... మీ వాళ్ళతో మాట్లాడి ముహూర్తం పెట్టుకోవడానికి. అయిదు సంవత్సరాల నాటి వాళ్ళ కోరికను తీరుస్తున్న ఈ ఎన్నికలకు వాళ్ళెంతయినా ఋణపడ్డారు."

"మీరు....మీరేమంటు...."

"తొందరపడి జవాబివ్వనక్కరలేదు ప్రసూ! వాలిపోతున్న కళ్ళు, నా కోసమే ఆ బుగ్గల్లో పూసిన గులాబీలూ నీ మనసునీ, అంగీకారాన్నీ నాకు చెప్పేశాయిలే!" అన్నాడు మోహన్ కారు స్పీడు ఎక్కువ చేస్తూ.

కాలేజీని ఒక కొలిక్కి తెచ్చిన ఎన్నికలు అయిపోయాయి. పెద్ద మెజారిటీతో మోహన్ కాలేజీ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయాడు. ఈ ఘన విజయానికి సంబంధించిన ఉత్సవాలూ పార్టీలూ అన్నీ పూర్తయి కాలేజీలో మళ్ళీ ప్రశాంత వాతావరణం అప్పుడప్పుడే ఏర్పడుతోంది. ఈ మధ్య తరచు ప్రసన్న మధ్యాహ్నం క్లాసులు ఎగగొడుతోంది. ఉదయం వేళ కాలేజీకి విజయ కంటె ముందే వెళ్ళిపోతోంది. క్లాసులో ఉన్నా ఆమె మొహం తప్పించడానికి ప్రయత్నిస్తున్నట్టుగా విజయకు అనిపించసాగింది.

*

ఆ రోజు శుక్రవారం. ఒంటరిగా కాలేజీకి వచ్చిన విజయ — క్లాసుకు ప్రసన్న రాకపోవడంతో కలతపడిన మనసుతో లేడీస్ వెయిటింగ్ రూమ్‌కు వచ్చేసింది. ప్రశాంతమైన చెరువుని ఎవరో కలచివేసినట్లుగా ఆమె మనసంతా వికలంగా వుంది. చిరాకుగా పుస్తకాలు టేబుల్ పైకి గిరవాటేసి, కుడిచేయి కళ్ళ మీద కప్పుకుని కుర్చీలో వెనక్కు జారబడింది. దూరంగా అప్పుడప్పుడు స్టూడెంట్ల నవ్వులు, ఒకటీ అరా మాటలూ తప్పిస్తే—అంతా నిశ్శబ్దంగా వుంది. దగ్గరగా వేసి ఉన్న తలుపులు త్రోసిన అలికిడి విని కళ్ళు తెరిచిన విజయకు — మోహన్‌తో కలిసి తిరిగే కృష్ణమూర్తి గుమ్మంలో నిలబడి ఉండడం కనిపించింది. ఆమె తనవేపు చూడగానే నమస్కారం చేశాడు. ప్రతి నమస్కారం చేస్తూ లేవబోయింది విజయ.

"అహఁ! మీరు కూర్చోండి. మీరు పర్మిషన్ ఇచ్చినా యివ్వకపోయినా లోపలకు వచ్చి మీకొక విషయం చెప్పడం నా విధి కనుక వచ్చాను."

విజయకు ఆ మాటలు అర్థమయ్యే లోగానే అతను చకచకా లోపలకు వచ్చేసి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. అప్పటికే తేరుకున్న విజయ, వినడానికి సిద్ధపడినదానిలా ముందుకు వంగి "ఊఁ! చెప్పండి"—అంది.

"ఈ రోజు ఇలా మీతో మాట్లాడాల్సి రావడం నా దురదృష్టం. మీకు కోపమొచ్చినా సరే చెప్పకతప్పదు." ఊపిరి తీసుకోవడానికన్నట్టు ఒక్క లిప్తకాలం ఆగాడతను.

"మీ ఫ్రెండ్ ప్రసన్నగారిని గురించి చెప్పడానికి వచ్చాను నేను."

విజయ ఒక్క క్షణం తెల్లబోయినా ఏం మాట్లాడలేదు. ఆమె కనుబొమలు మాత్రం ప్రశ్నార్థకంగా ముడుచుకున్నాయి.

"ప్రసన్న మోహన్‌తో కలిసి సినిమాలకూ, పిక్‌నిక్‌లకూ వెడుతున్నారు మీకు తెలుసా?"

ఆ విషయం ఈ మధ్యనే కొద్ది కొద్దిగా తెలుసుకుంటున్న విజయ తెలుసన్నట్టుగా అప్రయత్నంగానే తల ఊపింది.

"తెలుసా? తెలిసే ఎలా ఊరుకుంటున్నారు?"

విజయకు కొద్దిగా కోపం వచ్చింది.

"ఊరుకోక నేనేం చేయగలను? అయినా—మీరు మోహన్‌గారి స్నేహితులేగా? మీరే ఆయనను వారించకుండా...."

అర్థోక్తిలోనే అందుకుంటూ—"మిమ్మల్ని హెచ్చరించడానికి ఎందుకు వచ్చాననేగా మీప్రశ్న? మీరలా అడుగుతారని తెలుసు. మోహన్ పరంగా నా ప్రయత్నాలు విఫలమయ్యాయి. అందుకనే తప్పనిసరై మీ దగ్గరకు రావాల్సి వచ్చింది" అన్నాడు.

మనసు చివుక్కుమన్నా పైకి తేలకుండా "ప్రసన్న తన అభిరుచులకు తగిన వ్యక్తిని ఎన్నుకుంటే మీరెందుకు ఇంత బాధపడుతున్నారు?" అంది విజయ.


"తగిన వ్యక్తి!" ఆ పదాన్ని ఒత్తి పలుకుతూ హేళనగా నవ్వాడు కృష్ణమూర్తి.

"ఏ విషయంలో తగినవాడు విజయగారూ! మోహన్ అసలు రూపం తెలుసా మీకు? అతని కారులో షికార్లకూ సినిమాలకూ వెళ్ళిన ఆడపిల్లల్లో ప్రసన్న ఎన్నో నెంబరో తెలుసా మీకు? అతని అందమైన రూపానికి, దారుణమయిన కోరికలకి ఎంతమంది ఆడపిల్లలు బలైపోయారో ఊహించగలరా మీరు? క్రిందటి సంవత్సరం పద్మప్రియ చదువు మధ్యలోనే మానేసి హఠాత్తుగా పెళ్ళి చేసుకుని ఈ ఊరినుంచే ఎందుకు వెళ్ళిపోయిందో తెలుసా మీకు?" ఊపిరి పీల్చడం మర్చిపోయి వింటున్న విజయకు ఆ నాడు పెళ్ళిలో ముభావంగా, నిర్లిప్తంగా ఉన్న పద్మప్రియ ధోరణికి తనూ ఫ్రెండ్స్ విస్తుపోవడం జ్ఞాపకం వచ్చింది.

"ప్రసన్న అమాయకురాలు. అందరూ తనలాగే స్పోర్టివ్ అనుకుంటుంది. అందరిలోనూ మంచితనం మాత్రమే చూడగలుగుతుంది. ఆ మంచితనం వెనకాల, స్నేహం నీడలో ఉన్న విషనాగు ఆ అమ్మాయికి కనిపించడంలేదు. విజయా! — ప్లీజ్! ఆ విషనాగు కాటేయకముందే ప్రసన్నని హెచ్చరించండి. మీరు చెబితే ఆమె తప్పకుండా వింటుంది. ఆ అమ్మాయి చాలామంచిది. ఆ మంచితనానికి శిక్షగా ఆమె జీవితం బలైపోకూడదు — ప్లీజ్ విజయా — మీరైనా త్వరపడండి."

కృష్ణమూర్తి వెళ్ళిపోవడం విజయకు తెలియదు. ఇంటర్‌వెల్ అయి ఆడపిల్లల గుంపు బిలబిలమంటూ లోపలకు వచ్చేవరకూ కళ్ళు మూసుకుని మతిపోయిన దానిలా కూర్చుండిపోయింది.

మోహన్‌తో మార్నింగ్ షోకువెళ్ళి ప్రసన్న మధ్యాహ్నం మూడుగంటలకు క్లాసుకు వచ్చింది. తనతో ముభావంగా ఉంటున్న ప్రసన్నతో సున్నితమయిన ఈ విషయం ఎలా మాట్లాడాలో విజయకు అర్థం కావడంలేదు. నామమాత్రంగా తనను పలకరించి తన ప్రక్కన




కూర్చుని నోట్సు వ్రాసుకుంటున్న ప్రసన్న భుజం మీద చేయివేసి విషయమంతా అనునయంగా చెప్పాలన్నంత ఉద్వేగం పెల్లుబికింది విజయలో. మౌనంగా పాఠం వింటున్న విజయ హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చి, పాఠం వినడం మానేసి పెన్‌తీసి నోట్ బుక్‌లో ఏదో రాస్తూ కూర్చుంది. నలభై అయిదు నిముషాలు కష్టపడి వ్రాసిన ఉత్తరాన్ని లెక్చరర్ వెళ్ళగానే లేవబోయిన ప్రసన్న భుజం పట్టుకుని, ఆపి చటుక్కున ఆమె చేతిలో పెట్టేసి "దయచేసి నన్ను అపార్థం చేసుకోకు" అని మెల్లిగా చెప్పి, బయటకు వచ్చేసింది.

మర్నాడు లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో కాలు పెట్టిన విజయకు కుర్చీలో కూర్చుని ఉన్న ప్రసన్న కనిపించింది. వచ్చి ఎదురు కుర్చీలో కూర్చుండగానే 'విజయా' అన్న ప్రసన్న పిలుపుకు తలెత్తి చూసింది. ప్రసన్న మొహం కఠినంగా ఉంది. కళ్ళు తనని గుచ్చి చూస్తున్నాయి.

ఏమిటని విజయ అడిగేలోగానే ప్రసన్న అంది.

"నీ ఉత్తరానికి జవాబీయడానికి వచ్చాను. ఫ్రెండ్ పట్ల నీకున్న శ్రద్ధకు చాలా థేంక్స్. కాని ఒక్క విషయం.... మోహన్ నువ్వనుకుంటున్నంత మోసగాడు, దుర్మార్గుడు కాదు – అతను నన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాడు. నేను లేకుండా బ్రతకలేడు. ఆ విషయం నాకు స్పష్టంగా తెలుసు. అతను మరొక ఆడదానివేపు కన్నెత్తి చూడని అమాయకుడు. అటువంటిది ఆడపిల్లలను మోసం చేయడమా?" – ఏకబిగిగా చెప్పేసిన ప్రసన్న ఒక్కక్షణం ఆగింది. మరు నిముషంలో ఆమె పెదవుల మీద హేళనగా ఒక చిరునవ్వు మెరిసింది. అంతలోనే సీరియస్ అయిపోయి "కాని – కాని ప్రాణ స్నేహితులు అయిన వాళ్ళు కూడా జెలసీ ఫీలయ్యేంత ప్రత్యేకమైన వ్యక్తి మోహన్ అని నాకు తెలుసు" - అంది. మరుక్షణం పుస్తకాలు చేతుల్లోకి తీసుకుంటూ ఇంతసేపు స్తంభించిపోయి నిలబడిన విజయకేసి చూడనైనా చూడకుండా కుర్చీ ప్రక్కకు త్రోసి చరచరా బయటకు వెళ్ళిపోయింది ఆమె.



అవాక్కుగా ఉండిపోయిన విజయ తేరుకునే సరికి చాలాసేపు పట్టింది. జరిగినదంతా తల్చుకునే సరికి ఆమె కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. 'తను ప్రసన్న అదృష్టాన్ని చూసి అసూయపడుతున్నదా? ఇన్నేళ్ళ స్నేహంలో ప్రసన్న తనను అర్థం చేసుకున్నదంతేనా? ప్రేమ మైకం ప్రసన్ననింత గుడ్డిదాన్ని చేసిందా? ఎన్ని అన్నా ఎంత అపార్థం చేసుకున్నా ప్రసన్న అమాయకురాలు. తనకు ప్రాణం లాంటిది. ఈ సుడిగుండం నుండి ప్రసన్నను రక్షించడం ఎలా? అయినా తనను అపార్థం చేసుకున్న వ్యక్తి ఏమయితే తనకెందుకు? – ఉఁహుఁ — కాదు – ప్రసన్న అమాయకురాలు – దాన్ని ఎలాగైనా రక్షించాలి ఎలా — ఎలా?' క్లాసుకు వెళ్ళిందన్న మాటేగాని మండిపోతున్న ఆలోచనలతో విజయ మనసు అల్లకల్లోలమైపోయింది. తనను ప్రసన్న ఎంత అపార్థం చేసుకున్నా సాటి ఆడదానిగా ఆమెను రక్షించి తీరాలనే నిశ్చయానికి వచ్చింది. అందుకు తానేం చేయాలో కూడా ఆలోచించుకుంది. అప్పటికి ఆమె మనసు కాస్త కుదుటపడింది.

*

పదిరోజులు గడిచాయి. ప్రసన్న విజయతో మాట్లాడడం పూర్తిగా మానేసింది. ఆ రోజు కాలేజీకి రావడం లేటయిన ప్రసన్న లేడీస్ వెయిటింగ్ రూమ్ దగ్గరకు వస్తూ అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి స్తంభించిపోయింది. వెయిటింగ్ రూమ్ తలుపుకు జారబడి ఉన్న విజయతో ఏదో మాట్లాడుతున్నాడు మోహన్. అతి శ్రద్ధతో వింటున్న విజయ మొహం చిరునవ్వుతో మెరిసిపోతోంది. క్లాస్ రూమ్స్ నుండి విసిరేసినట్టు ఓ ప్రక్కగా ఉండే ఆ వెయిటింగ్ రూము దరిదాపులలో ఎవ్వరూలేరు. ఆ నిశ్శబ్దంలో వెయిటింగ్ రూమ్ గోడ దగ్గరే ఆగిపోయిన ప్రసన్నకు ఈసారి మోహన్ మాటలు స్పష్టంగా వినిపించాయి.

"మొదటిసారి మిమ్మల్ని చూసినప్పుడు అనుకున్నాను – నా ఊహల్లో కలల్లో స్పష్టాస్పష్టంగా కనిపిస్తూ నన్ను మురిపించి వేధిస్తున్న నా ఊహాసుందరి ఇన్నాళ్ళకు నా కళ్ళ ముందు ప్రత్యక్షమయిందని. కాని ఆ విషయం మీకు ఎలా చెప్పాలో నాకు తెలియలేదు. నా ఆవేదనంతా కృష్ణమూర్తితో చెప్పుకుంటే అంతా విని వాడు 'కాలేజీ యూనియన్ ప్రెసిడెంట్ ఆడపిల్లలతో – అందునా తన ఆరాధ్య దేవతతో మాట్లాడలేని పిరికివాడనుకోలేదు' – అనేశాడు. ఆడపిల్లలతో మాట్లాడవచ్చు. కాని ఆరాధ్య దేవత ముందు పెదవి కదపలేమని వాడికి తెలియదు. నా కలల్లో మెరిసి, నన్ను మురిపించి, నిజ జీవితంలో ప్రత్యక్షమయినప్పుడు ముభావంతో సీరియస్‌నెస్‌తో నన్నింత కలవర పెట్టినట్టు ఇన్నాళ్ళూ మీకు తెలియదా విజయా! పోనీలెండి....ఇప్పటికయినా మీరు అర్థమయ్యారు. అదృష్టవంతుణ్ణి!" కవిత్వం మాట్లాడుతున్నాడు మోహన్.

చిరునవ్వుతో వింటున్న విజయ తల వంచుకుంటూ "నిదానం ప్రధానం అన్నారు కదా –" అంది.

"వాళ్ళే ఆలస్యం అమృతం విషం అని కూడా అన్నారు తెలుసా? ఈ బంగారు బొమ్మపై ఇంకెవరికయినా అధికారం సంక్రమించి ఉంటే నేనేమైపోయేవాడిని?"

"ఎలా ఉంటుంది? ఆ బొమ్మ మనసు ఇది వరకే ఈ రూపంతో నిండిపోయినప్పుడు?"

"అయితే ఆ బొమ్మ మనసులోని రూపాన్ని తలుచుకుంటూ ఒంటరిగా ఇలా లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో ఈ మధ్యాహ్నాన్ని వృధా చెయ్యదు. ఆ రూపం తాలూకు వ్యక్తితో కలిసి అలా బయటికి వచ్చి ఆ వ్యక్తిని అదృష్టవంతుణ్ణి చేస్తుంది. కాసేపు అలా వెళ్లివద్దాం పదండి! విజయా – మీ కిప్పుడు క్లాసు లేదుగా?"

సంభాషణ ఇలా మలుపు తిరుగుతుందని ఊహించని విజయ కంగారుపడింది. ఆమె తటపటాయిస్తున్నంతలోనే కాస్త నిష్ఠురం ధ్వనిస్తున్న గొంతుతో మోహన్ "ఏం నా మీద ఇంకా నమ్మకం లేదా? నాతో రాకూడదా?" అన్నాడు.

తడబాటును కప్పి పుచ్చుకుంటూ "అబ్బే అదేంలేదు. అలాగే వెళదాం. ఇప్పుడే పుస్తకాలు లోపలి పెట్టి వస్తానుండండి!" అంటూ లోపలకు వెళ్ళింది విజయ.

విజయా మోహన్ కలిసి ఎటు వెళ్ళారో చూడడం కోసం ప్రసన్న ఇక అక్కడ వేచి ఉండలేకపోయింది. పైన ఆకాశం, చుట్టూ ఉన్న కాలేజీ గోడలూ, అన్నీ గిరగిర తిరుగుతున్నట్టు అనిపించసాగి—ఆమె ఆసరాగా చేతిని గోడకు ఆన్చి చేరబడింది. అలా కొంచెం సేపు నిలబడి తలవంచుకుని నెమ్మదిగా వెనక్కు తిరిగి క్లాసు వేపుగా వెళ్ళిపోయింది.

నాలుగురోజులు గడిచాయి. ఆ రోజు సాయంత్రం ప్రాక్టికల్స్ పూర్తి చేసుకుని ఆలస్యమై పోయిందని తొందరగా ఇంటికి బయలు దేరింది విజయ. కెమిస్ట్రీ రీడింగ్స్ తనవి తప్పు కావడంతో అంతా వెళ్ళిపోయినా ఆమె ఒక్కత్తీ అంతసేపు ఆగవలసి వచ్చింది.

కాలేజీ గేటు దగ్గరికి వచ్చేసరికి ఎర్రటి ఫియట్ కారు ఆమె ప్రక్కగా వచ్చి ఆగింది. ఉలిక్కిపడి తలెత్తింది. డ్రైవింగ్ సీట్లో కూర్చుని ఉన్న మోహన్ చిరునవ్వు నవ్వుతూ. "కారు ఎక్కండి—డ్రాప్ చేసేస్తాను"—అన్నాడు. మరో మాట చెప్పడానికి అవకాశం దొరకని విజయ మాట్లాడకుండా బేక్‌డోర్ తెరిచి లోపలకు ఎక్కింది.

మరుక్షణం ముందుకు దూసుకుపోయిన కారు తిన్నగా టాంక్‌బండ్ దగ్గర ఆగింది. కూలింగ్ గ్లాసెస్ చేతిలోకి తీసుకుంటూ "ఇక్కడ ఆపానని కోపమా?" అన్నాడు మోహన్.

"ఊఁహూఁ! నాకు తెలుసు మీరు ఇక్కడికే తీసుకువస్తారని."—తమాషాగా నవ్వింది విజయ.

దూరంగా హుసేన్‌సాగర్ అంచుల చివర వెలుగు తగ్గిపోతోంది. ఇంకా దీపాలు వెలగక పోవడంతో చీకాకుపడిన మనసులా వాతావరణం మబ్బుగా మసకగా వుంది. విజయ మోహన్ నడుస్తూ వెళ్ళి, మూలగా ఉన్న ఒక గుబురు పొద దగ్గర కూర్చున్నారు.

మోచేతిమీద వెనక్కు వాలి కూర్చున్నాడు మోహన్.

మోకాళ్ళ చుట్టూ ఎడం చేయి చుట్టుకుని, తల కాళ్ళ మీద వంచుకుని కుడిచేత్తో గడ్డిపరకల్ని తెంపుతూ కూర్చుంది విజయ. దూరం నుంచి వినిపిస్తున్న పాట తప్పితే ఇద్దరి మధ్యా నిశ్శబ్దం పేరుకుపోయింది. ఉన్నట్టుండి మోహన్ అడిగాడు.

"ఇంటికి రావడం ఎందుకు ఆలస్యమయిందంటే ఏం చెబుతారు విజయా?"—

"ఏం చెప్పమంటారు?"

"ప్రాక్టికల్స్ ఉన్నాయంటే సరి."

"ఇలా మీతో పార్కుకి వచ్చానని చెప్ప కూడదా?"

"చెప్పకూడదని కాదు—మనిద్దరినీ పార్కుకీ, సినిమాలకీ వెళ్ళమని మీవాళ్ళే పంపే రోజులు రాబోతున్నాయి. పరీక్షలయ్యే వరకూ మాత్రం ఈ అబద్ధం తప్పదు."

"అప్పటివరకూ కలుసుకోకపోతే?"

"అమ్మో! అంత పెద్ద వియోగమే! మిమ్మల్ని చూడకుండా, మీతో ఇలా ఏకాంతంగా మాటలాడకుండా ఉండగలనని ఎలా అనుకున్నారు? పోనీ మీరలా ఉండగలరా? అటువంటి ఊహయినా మనసులోకి రానివ్వవద్దు—" ఉద్రేకంతో అన్నాడు మోహన్.

విజయ మాట్లాడలేదు. తలవంచుకుని అలా గడ్డిపరకల్ని తెంపుతూ కూర్చుంది. ఎందుకో ఆ తర్వాత మోహన్ కూడా మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఇద్దరిమధ్యా నిశ్శబ్దంగా పది నిముషాలు గడిచాయి. హఠాత్తుగా ముందుకు వంగి గడ్డిని తెంపుతున్న విజయ చేతిని పట్టుకుని "మీరు—ఊఁహూఁ-నువ్వు-నువ్వు నాకు నిజంగానే కావాలి విజయా"—అన్నాడు మోహన్. అతని గొంతు ఏదో చెప్పలేని ఉద్వేగంతో బొంగురుపోయింది.

విజయ చురుగ్గా కళ్ళెత్తి అతని కళ్ళల్లోకి సూటిగా చూసింది. విజయ నుండి అటువంటి నిర్భయత్వాన్ని ఎదురు చూడని మోహన్ ఒక్క క్షణం తడబడ్డాడు. అలా చూస్తూనే ఎడంచేత్తో నెమ్మదిగా అతని వేళ్ళు వదులు చేసి తన చేతిని తప్పించి, చూపులు తిప్పుకుని విజయ హుసేన్‌సాగర్ ఒడ్డును తాకాలని ఉత్సాహంతో ముందుకు వస్తూ మధ్యలోనే విరిగిపోతున్న చిన్న చిన్న అలలను తదేకంగా చూస్తుండిపోయింది. సంధ్యను ఆక్రమించుకుని చుట్టూ ముసురుకుంటున్న చీకట్లలా వారి మధ్య వాతావరణం ఎందుకో హఠాత్తుగా గంభీరంగా మారిపోయినట్లుగా ఉంది. మోహన్ ఒక్క క్షణం ఉక్కిరి బిక్కిరయ్యాడు. మరోసారి విజయను పలకరించే కోరికా ధైర్యం కూడా ఆవిరిలా కరిగిపోయాయి. అయిదు నిమిషాలు గడిచాయి. హఠాత్తుగా లేచి నిలబడుతూ విజయ "ఇక వెళ్దామా!" అన్నది మరోమాట మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా ముందుకి అడుగేస్తూ. అప్రయత్నంగా లేచి తన కోసం ఆగకుండా చకచకా వెళ్ళిపోతున్న ఆమెను నిశ్శబ్దంగా అనుసరించాడు మోహన్. తిన్నగా కారు దగ్గరికి వచ్చి నిలబడిన విజయ 'విజయా!' అన్న మోహన్ పిలుపుకు తల త్రిప్పింది.

"కోపమా — తొందరపడ్డానా?" మెల్లిగా అడిగాడు మోహన్.

మళ్ళా ఒకసారి అతని కళ్ళలోకి సూటిగా చూసింది విజయ. గుండెలోతుల్లోకి దూసుకుపోయి తన రహస్యాలను బయటికి లాగుతున్న గాలాలులా ఉన్న ఆ చూపులకి మోహన్ తడబడ్డాడు. అతని వంక అలాగే చూస్తూ విజయ అన్నది:

"నా ప్రసన్న అంత అమాయకురాలు ఎలా కాగలిగిందా అని ఆలోచిస్తున్నాను."

ప్రక్కనే పిడుగు పడ్డట్టుగా అదిరి పడ్డాడు మోహన్.

"మీరు - మీరు....!"

"ప్లీజ్ — మీరేమీ మాట్లాడకండి — నన్నిక పూర్తిగా నిజం చెప్పనివ్వండి. మీరేమిటో నాకు తెలుసు - ఎందరు ప్రసన్నలు ఈ మాయమాటలకు మోసపోయారో నాకంతా తెలుసు. ప్రసన్న అంటే నాకెంత ఇష్టమో మీకు తెలియదు. అది అమాయకురాలు. ఆ అమాయకత్వానికి శిక్షగా అది మోసపోకూడదు. దాని జీవితం నా కళ్ళ ముందే పతనమై పోతుంటే చూస్తూ ఎలా ఊరుకోను. మీ గురించి చెబితే అది నన్నే అపార్థం చేసుకుంది. అయినా ఒక ఫ్రెండ్‌గా దాన్ని రక్షించే బాధ్యత నాకుంది. మీ ఆకర్షణ నుండి దాన్ని తప్పించాలంటే ఇంక నాకు ఒక్కటే మార్గం కనిపించింది, అది దాని కళ్ళు బడేలా మీతో లేని ప్రణయాన్ని నటించడం. నటిస్తున్నానే కాని ఈ పదిహేను రోజులుగా ఎంత నరకం అనుభవిస్తున్నానో మీకేం తెలుసు? నా ప్రయత్నం ఫలించింది — మొన్న వెయిటింగ్ రూమ్ దగ్గర మీరు ప్రణయ కవిత్వం ఒలకబోస్తున్నప్పుడు గోడ ప్రక్కగా నిలబడి అది విన్నది. అంతేకాదు. ఇప్పుడిలా మనిద్దరం మీ కార్లో కాలేజీదాటి రావడం కూడా చూసింది. అసలు అక్కడే మీకు నేను ఏక్ట్ చేశానని చెప్పేద్దామనుకున్నాను. కాని, దూరంగా మనకు కనిపించకుండా పొంచి చూస్తున్న ప్రసన్నను చూసి, తప్పని సరిగా ఈ చేదు నిజాల్ని చెప్పడానికి మీతో ఇంతదూరం రావాల్సి వచ్చింది.

ఇక భయం లేదు. ప్రసన్న మనసు మీ నుంచి శాశ్వతంగా తిరిగిపోతుంది. ఇప్పుడు బాధపడ్డా ఈ ఆశాభంగం నుంచి కొన్నాళ్ళకు తప్పకుండా తేరుకుంటుంది. నాకా నమ్మకముంది. నా మీది కోపంతో నాతో మాట్లాడటం మానేసింది. అయినా ఫర్వాలేదు. ఫ్రెండ్‌గా కర్తవ్యం నిర్వర్తించి నేను పతనం నుండి ప్రసన్నను తప్పించాను."

విజయ చెప్పడం పూర్తిచేసేసరికి మోహన్ కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. ఏమీ మాట్లాడకుండా ఆవేశాన్ని బలవంతంగా అణుచుకుంటూ ఆమె వేపే రెండు క్షణాలు చూశాడు. విజయ చలించలేదు. హఠాత్తుగా కదిలి కారు ముందు తలుపు తీసురుని కూర్చున్నాడు. మరుక్షణంలో విసురుగా తలుపు పెద్ద చప్పుడుతో మూసుకోవడమూ, కారు రివ్వున దూసుకుపోవడమూ జరిగిపోయింది. ఆ చీకటిలో తననలా ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతున్న కారువేపు అది మలుపు తిరిగే వరకూ చూస్తూ నిలబడింది విజయ. తరువాత ఒక నిట్టూర్పు విడిచి నెమ్మదిగా ఇంటికి బయలుదేరింది.

*

అయిదేళ్ళు గడిచాయి. ఆ అయిదేళ్ళలో విజయ జీవితం ఎన్నో మలుపులు తిరిగింది. ఆమె కుటుంబం హైదరాబాదు నుంచి విశాఖపట్నం చేరుకుంది. అక్కడి నుంచి ఆమె ప్రసన్నకు వివరంగా ఉత్తరం వ్రాసింది. కాని ప్రత్యుత్తరం రాలేదు. ఆ తర్వాత విజయ జీవితంతో కాలం విసుగూ విరామమూ లేకుండా ఆడుకుంది. అలా మరో మూడేళ్ళు గడిచాయి.

ఆ రోజు మంగళవారం. సాయంత్రం అయిదవుతోంది. వచ్చేపోయే వాళ్ళతో, పిల్లల కేరింతలతో, కాలేజీ స్టూడెంట్ల నవ్వులతో పక్షులతో కలకలమంటున్న పువ్వుల తోటలా ఉంది మద్రాస్ మెరీనా బీచ్. వాళ్ళ ఉత్సాహంతో తానూ పాలు పంచుకుంటున్నట్లుగా సముద్రంలో అలలు అంతెత్తున ఎగిరి పడుతున్నాయి. బీచ్‌లోని బుహారీ హోటల్ ఫేమిలీ రూమ్‌లో కూర్చుని కాఫీ తీసుకుంటూ ఆ అలలనే చూస్తోంది విజయ. ఆమె ఇదివరకటికన్నా కొద్దిగా లావయింది. జుట్టు ముడి వేసుకుంది. మొహంలో వయసూ అనుభవమూ సమకూర్చిన నిండుతనం ఉంది. ఇంతలో స్ప్రింగ్ డోర్ తెరుచుకుని ముందుగా నలుగురు పిల్లలూ, "పరుగు పెట్టకండి" అంటూ హడావుడిగా ఒకామె లోపలికి వచ్చింది. విజయ తల తిప్పింది. ఆ వచ్చినామె విజయను చూస్తూనే, "అరె! విజయా! నువ్వా!" అంటూ ముందుకు వచ్చింది. ఆమె ప్రసన్న. సంభ్రమాశ్చర్యాలతో విజయ కూడా లేచివచ్చి ఆమె చేతులు అందుకుంది. ఒకరినొకరు తనివితీరా చూసుకుంటూ అలా నిలబడిపోయారు. కాసేపటికి విజయే తేరుకొని "పద కూర్చుందాం" అంటూ కుర్చీలకేసి లాక్కుపోయింది. అందరూ టిఫిన్ల హడావుడిలో పడ్డారు. కబుర్ల మధ్య ప్రసన్న–విజయా వాళ్లూ హైదరాబాద్ నుండి వైజాగ్ వెళ్ళిపోయిన తర్వాత సంవత్సరమే తనకు పెళ్ళయిందనీ, భర్త అసిస్టెంట్ ఇంజనీరనీ – చాలా మంచివాడనీ చెప్పింది. అంతా విని విజయ "మరి నాకు ఇన్విటేషనయినా పంపకుండా పెళ్ళిచేసుకున్నావు కదూ?" అన్నది తెచ్చిపెట్టుకున్న కోపంతో. అంతవరకూ నవ్వుతూ చెపుతున్న ప్రసన్న ముఖం గంభీరంగా మారిపోయింది. హఠాత్తుగా విజయ చేతిని పట్టుకుని "నన్ను క్షమించగలవా విజ్జీ!" అంది బరువుగా.

"అదేమిటి?" విజయ తెల్లబోయింది.

"అప్పుడు మోహన్‌తో నీ ప్రవర్తనను అనుమానించి నిన్ను అపార్థం చేసుకున్నందుకు-నువ్వు ఊరు వదలి వెళ్ళిపోయాక మోహన్ నిజస్వరూపం గురించి తెలుసుకున్నాను. తర్వాత నువ్వు వైజాగ్ నుంచి రాసిన ఉత్తరం అందింది. నువ్వు చేసిన సాహసం అర్థమయింది. జరగబోయిన అనర్థాన్ని తలుచుకుని ఎంత వణికిపోయానో, నీ పట్ల జరిగిపోయిన పొరపాటుకు అంతకంటె ఎక్కువగా కుమిలిపోయాను. ఆ తర్వాత నువ్వు మళ్ళీ ఉత్తరం వ్రాసావు. జవాబివ్వడానికి నాకే మొహం చెల్లలేదు. ఈ జీవితానికి ఇంతటి సుఖం సంతోషం ప్రసాదించిన దేవతకి, ఎప్పటికయినా అదృష్టం కలిసివస్తే స్వయంగా కృతజ్ఞత చెప్పుకోవాలని ఎదురు చూశాను. ఇన్నాళ్ళకి భగవంతుడు కనికరించి నిన్ను చూపించాడు. ఈ నాటి ఈ చల్లటి సంసారం – పిల్లలూ, మనశ్శాంతి అంతా నువ్వు పెట్టిన భిక్షే. నన్ను క్షమించగలవా విజ్జీ?" అంది ప్రసన్న ఉద్వేగంతో.

నెమ్మదిగా ఆమె భుజం మీద చేయివేస్తూ "అదేమిటి ప్రసన్నా – ఇందులో కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన గొప్ప ఏముంది! నాకప్పుడు అంతకంటె గత్యంతరం తోచలేదు. ఆ ఆవేశంలో నాకు మంచిదని తోచినట్టు చేసాను. ఒకవేళ నేనే అటువంటి పొరబాట్లు చేయబోతే నువ్వు అడ్డుపడి ఉండవా?" – అంది విజయ తేలికగా నవ్వుతూ.

"నేనా" అంది ప్రసన్న నీరసంగా నవ్వి – "నేనయితే నీ ఖర్మ అనుకుని ఊరుకునేదాన్నేమో! సరేకాని — ఇంతకీ ఇంతసేపు నా సంగతులన్నీ తెలుసుకున్నావుగానీ నీ విషయం ఒక్కటి కూడా చెప్పలేదు. మీ వారు ఏం చేస్తున్నారు?" అడిగింది ప్రసన్న.

"ఆయన డాక్టరు" – అంది విజయ చిరునవ్వుతో.

"అలాగా? ఇద్దరూ ఎదుటి వాళ్ళ రోగాలు కుదిర్చేవారే నన్న మాట – మరి పిల్లలు ఎంతమంది?"

"చాలా మంది."

"అయితే ఇంకనేం? ఇదిగో యిప్పుడే చెప్పేస్తున్నాను—మా ఒక అమ్మాయి ఒక అబ్బాయి మీకు కోడలూ, అల్లుడూను. ఇదే ఖాయం మాట సుమా – ఏరీ ఇంతకూ ఒక్కళ్ళని తీసుకు రాలేదేం?"

"వాళ్ళు రారు."

"ఏం....అలిగారా అమ్మ మీద?"

"ఊఁ మరే!"

"పిల్లలతోపాటు మా అన్నగారు కూడా అలిగారా ఏమిటి? ఒక్కర్తెవూ వచ్చావు?"

"అవును – అలిగి బొంబాయి వెళ్ళారు."

"అయితే పిల్లల్ని యింటి దగ్గర వదిలి వచ్చావా – భయపడరూ?"

"ఊఁహూఁ..వాళ్ళ అమ్మలు వాళ్ళని జాగ్రత్తగా చూసుకుంటారు."

"విజయా!" ప్రసన్న తెల్లబోయింది.

"ఏముంది....ఎంత నచ్చితే మాత్రం టీచర్ దగ్గర సాయంత్రం అయిదు దాటాక ఎలా ఉంటారు – వాళ్ళ ఇళ్ళకు వెళ్ళిపోక?" తెల్లబోయి వింటున్న ప్రసన్న పెద్దగా నవ్వి–"అబ్బ ఎంత కంగారు పెట్టావు – పిల్లలు లేరని చెప్పడానికా ఇదంతా – పోనీలే....నా పిల్లలు ఇద్దరిని ఇచ్చేస్తాను. సరేగాని తమరు ఉద్యోగం చేస్తున్నారా – అంత అవసరం ఏమొచ్చింది?"

"చెయ్యకూడదని లేదుగా?"

"లేదనుకో – కాని పిల్లలు కూడా లేరు అన్నప్పుడు — నువ్వు అన్నగారితో పాయిగా

ఉండక ఇలా ఉద్యోగం చెయ్యడం ఎందుకు? ఇలా తను పొరుగూర్లు వెళ్ళితే– నువ్విక్కడ ఒంటరిగా బీచ్‌లో విరహ గీతాలు పాడుకుంటూ ఉంటావా? ఇంతకూ ఎప్పుడొస్తారు మా అన్నగారు?''

''వెళ్ళారని చెప్పానుగాని వస్తారని చెప్పలేదే?''

''విజయా!'' ప్రసన్న తెల్లబోయింది: ''ఏమిటంటున్నావు నాకేమీ అర్థం కావడం లేదు విజయా!''

''అర్థం కావడానికి ఏముంది? ఎప్పుడు వస్తారో చెప్పడానికి ఎప్పుడొచ్చేదీ తను నాకు చెప్పలేదు.''

''అంటే?''

''వారు అక్కడే వుంటున్నారు.''

''మరి నువ్విక్కడా–ఇబ్బంది కాదూ?''


''ఇబ్బందికేముంది–చాలా సంవత్సరాలనుండీ అలవాటయిందేగా?''

''ఏమిటీ నువ్వంటున్నది – అంతా అయోమయంగా వుంది. వివరంగా చెప్పు.''

''ఏముంది. ఆయనకు నేను నచ్చలేదు.''

''ఏం!–ఎందుకని?''

''నేనంటే....'' ఏదో చెప్పబోయిన విజయ గొంతు వణికింది. అంతలోనే దాన్ని అణచుకుని ''నేనంటే–నా ప్రవర్తన....''–అంది.



''విజయా!'' ప్రసన్న తెల్లబోయింది.

''అవును నా శీలం మంచిది కాదట. మా పెళ్ళయ్యాక రెండు సంవత్సరాలకి ఆయనకు ఆ విషయం తెలిసింది.''

''అంటే?''

''కాలేజీలో ఫైనల్ ఇయర్‌లో ఉండగా నేను నా యిష్టం వచ్చినట్టు తిరిగానట!''

''విజయా!''

''అవును. మోహన్ అనే ఎర్రకారూ, అందమైన మొహం ఉన్న అబ్బాయి నేనూ మనసిచ్చి పుచ్చుకున్నాం. జరిగిపోవాల్సిన పెళ్ళి ఏ కారణాల వల్లో ఆగిపోయింది. కాని మేం మటుకు కాబోయే భార్యా భర్తల్లాగే సినిమాలూ షికార్లూ కూడా తిరుగుతూండేవాళ్ళం.''

''విజయా!'' ప్రసన్న ఈసారి ఆగలేక అరిచింది.

''అవును. ఆయనకు కాలేజీల్లో చదివే అమ్మాయిల మీద మొదటినుండీ అంత మంచి అభిప్రాయం ఉండేది కాదు. నేను చాలాసార్లు ఆయన అభిప్రాయాలు మార్చాలని ప్రయత్నించాను. కాని ఇంతలోనే మనం ఫైనలియర్లో ఉన్నప్పుడు సెకండియర్ చదువుతూ ఎలక్షన్లలో మోహన్‌కి సహాయపడిన స్టూడెంట్ ఒకడు ట్రీట్‌మెంట్ కోసం ఆయన హాస్పిటల్‌లో జాయిన్ అయ్యాడు. అతనేదో సందర్భంలో నేను హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు నన్ను చూసి గుర్తుపట్టి ఆ తర్వాత ఆయనతో–మోహన్‌తో నా చనువు గురించి చెప్పాడు. అనుమానం పెనుభూతంలా ఆయన్ని వేధించడం మొదలుపెట్టింది. పూర్తిగా మారిపోయారు. నన్ను పుట్టింటికి పంపేస్తానన్నారు. ఆఖరికి నేనెంత ప్రాధేయపడినా వినకుండా బొంబాయి వెళ్ళిపోయారు. ఇక అక్కడ స్థిరపడిపోయినట్టే–'' మామూలుగా చెప్పాలని విజయ ఎంత ప్రయత్నించినా ఆమె గొంతు వణికింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''అన్యాయం–అబద్ధం–అంతా పచ్చి అబద్ధం–విజయా నిజం నాకు తెలుసు. మీ వారికి నిజం నేను చెబుతాను'' – ఆవేశంతో ఊగిపోతూ ప్రసన్న అరుస్తున్నట్టుగా అంది.

కిటికీ దగ్గర నిలబడి సముద్రంలోకి చూస్తున్న విజయ నిదానంగా ఇటు తిరిగి నవ్వింది. మళ్ళీ సముద్రం వేపే తిరిగి చూసింది.

సముద్రం మీదుగా మెరుస్తూ వస్తున్న సాయంకాలపు నీరెండ కిటికీ దగ్గర నిలబడ్డ ఆమెను దాటుకుని లోపలికి రావడానికి ప్రయత్నిస్తున్నది. ఆ వెలుతురును ఆపడానికా అన్నట్టు విజయ ప్రసన్నల నీడలు ఆ గది అంతటా నెమ్మదిగా వ్యాపిస్తున్నాయి. చాలాసేపటికి ఇటు తల త్రిప్పిన విజయ ఆ సంజెనీడలకేసి చూస్తూ ఉండిపోయింది. శుష్కమందహాసం ఒకటి ఆమె పెదాలపైన బెరుకుగా మెరిసింది.

''ఆ నీడల్ని చూడు ప్రసూ! మధ్యాహ్నం సూర్యుడి వెలుగుకు భయపడి అవి మన కాళ్ళ క్రిందే అణిగి ఉన్నంతవరకూ వాటిని మనం గుర్తించం. సూర్యుడు పడమరకు తిరుగుతున్న కొద్దీ ఈ నీడలు మన కాళ్ళ క్రింద నుండి జారిపోయి సూర్యాస్తమయానికి మనకంటే ఎన్నోరెట్లు పెద్దవైపోతాయి. వాటి ముందు మనం చాలా చిన్నవాళ్ళం, అల్పులం అయిపోతాం. వాటిని అధిగమించేలా మనం పెరగాలనుకునేటంతలోనే వాటితోపాటు మనం కూడా ముంచుకు వచ్చే చీకటిలో కలిసిపోతాం.

జీవితంలో కొన్ని పనులు కూడా అంతే ప్రసూ: ఆ పనులు చేస్తున్నప్పుడు వాటి తాలూకు నీడలు మనకు అసలు కనిపించక–కాదు–పట్టి చూస్తేనే కాని కనిపించని ఆ నీడల్ని ఆ ఆవేశంలో మనం గుర్తించం. ఆ పని అయిపోగానే ఆ విషయాన్ని మర్చిపోతాం. కాని అవి సంజెనీడలు–మొండివి. బాగా పెరిగిపోవడమే వాటి లక్షణం. వాటిని గుర్తించేవరకూ మనల్ని అవి విడిచిపెట్టవ్. గుర్తించేసరికి....''నిర్లిప్తంగా వేదాంతిలా చెప్పుకుపోతున్న విజయ గొంతు హఠాత్తుగా వణికింది. ఈ నాలుగయిదు సంవత్సరాలనుండీ అలవాటు చేసుకున్న నిగ్రహంతో ఆ ఆవేదనను దిగమ్రింగి మళ్ళీ నిర్వికారంగా చెప్పసాగింది.... ''గుర్తించేసరికి మన జీవితంలోని వెలుగునంతటినీ ఆ నీడలు ఆక్రమించేసి ఉంటాయి. అంతేకదూ ప్రసూ!''–ఇక మాటలాడలేనిదానిలా చటుక్కున అటు తిరిగిపోయింది విజయ. అయోమయంగా, చిన్ననాటి తన స్నేహితురాలిని చూస్తూ ప్రసన్న చేష్టలుడిగి అలా కూర్చునే ఉంది.

సంజెనీడల్ని పెద్దవి చేస్తూ వెలుతురంతా మూట కట్టుకుని సూర్యుడు ఒక్కొక్క మెట్టే చీకటి సముద్రంలోకి జారిపోతున్నాడు. *